# తాకట్టు కొంపలోనే తనువు చాలించాలా?!

నేను ఆఫీసునుండి తిరిగి వచ్చే సరికి మా ఆవిడ హుషారుగా స్వాగతం పలికింది! ఆవిడ ముఖం మతాబాలాగా వెలిగిపోతోంది! ఆవిడ చేతిలో ఏదో రంగురంగుల కాగితం రెపరెపలాతోంది.

"ఏమిటంత హుషారుగా వున్నావు? ఏమిటీ కథ?" అన్నాను బూటు లేసులు విప్పుకుంటూ,

"కథే మరి! త్వరలోనే మీరో ఇంటివాళ్ళు కాబోతున్నారు!" అంది. తుళ్ళిపడ్డాను! ఇప్పుడు నా వయసు యాభయి అయిదు! ఇంకో అయిదేళ్ళకే రిటైర్ కాబోతున్నాను. మా ఆవిడ నాకంటే అయిదేళ్ళు చిన్నది. ఇప్పుడు నాకు మళ్ళీపెళ్ళా?!

"ఓ కూతుర్ని కని, దానికి పెళ్ళి చేసి అత్తవారింటికి పంపించినా, ఇంకా నువ్వు పాతికేళ్ళ యవ్వనవతిలా మిలమిల్లాడిపోతున్నావు! నాకిపుడు మళ్ళీపెళ్ళి ఎందుకు?" అన్నాను. కాస్త సిగ్గు అభినయిస్తూ.

"చాల్లేండి సంబడం! తలమాసినవాడు ఎవడయినా పిల్లనిస్తే చేసుకునేందుకు రెడీ అయిపోతారు కాబోలు! మీరో ఇంటివాళ్ళుకాబోతున్నారంటే, త్వరలోనే మీరో ఇల్లు స్వంతం చేసుకోబోతున్నారు అని అర్థం ! హు" అంటూ మూలిగింది.

'ఫ్లాటో' లేకపోతే 'ఇల్లో' కొనే ప్రపోజలు మళ్ళీతెరమీదకు తెస్తోందని నాకర్థమయింది!. "ఏమిటి కథ! కాస్త వివరంగా చెప్పు!" అన్నాను.

అప్పుడు తన చేతిలోని రంగుల బ్రోచర్ నాముందుంచింది.

"మీకు ఇప్పటికి ముప్ఫయి సంవత్సరాల సర్వీసు పూర్తయి వుంటే, ప్రస్తుతం నెల జీతం ముప్ఫయి వేలకు మించి వుంటే , మీరు పర్మినెంటు ఉద్యోగంలో వుంటే చాలు, అయిదు లక్షలు చెల్లిస్తే వెయ్యి అడుగుల టూ బెడ్‌రూం అపార్ట్‌మెంటు హరితావేలి దగ్గర్లో, యండాడలో మీ స్వంతమయిపోతుంది! 'రియల్టర్ అండ్ రియల్టర్' అనే రియల్ ఎస్టేట్ కంపెనీ సేల్సు కుర్రాడు మనింటికి వచ్చి ఈ బ్రోచరు ఇచ్చి వెళ్ళాడు. రేపు పొద్దుట మళ్ళీ వచ్చి కలుస్తానన్నాడు. ఈ విశాఖ నగరం అంతా జల్లెడ పట్టి, వాళ్ల నిబంధనల మేరకు అర్హులయిన వారిని, ఓ వందమందిని ఎంపిక చేశారట. ప్రతి వారికీ ఓ ఫ్లాట్ అందజేయటానికి తగిన ప్రణాళిక సిద్ధం చేశారట!" అని మాట్లాడటం ఆపి ఆయాసం తీర్చుకుంటోంది.

"అయిదు లక్షలకే వెయ్యి అడుగుల ఫ్లాట్ ఇచ్చేస్తారా సుందరీ! అంతా వట్టి బోగస్" అన్నాను తేలిగ్గా.

"అయిదు లక్షలకి ఇచ్చేస్తారేమిటి? మనకి నొప్పిలేకుండా సులువుగా వాయిదాలు

కట్టేలా పథకం తయారు చేశారు. ఇదిగో చూడండి! 'అయ్యో మీకు సొంత ఇల్లు లేదా? రిటైరయిపోతున్నారా? పాపం!' అంటూ హెడ్డింగు పెట్టి అంతా వివరంగా రాశారు. ఫ్లాటు పదహారు లక్షలు! ముందు మనం అయిదు లక్షలు కట్టేస్తే చాలు! సరిగ్గా రెండునెలల్లో కొత్తఫ్లాట్‌లో మనం పాలు పొంగించుకుని దిగిపోవటమే" అంది.

"మరి మిగిలిన పదకొండు లక్షలూ ఎవరు కడతారు? మీ బాబు కడతాడా?"

"ఎప్పుడో రిటైరయిపోయి, ఫించను డబ్బుల్తో బతుకీడుస్తున్న మా బాబు ఎందుకు కడతారు? మనమే కట్టుకుంటాం!" అంది ముక్కు ఎగపీలుస్తూ.

"మనమే కడతామా? ఎలా కడతాం? ఈ అద్దె ఇంటి పెరట్లో లంకెబిందెలు ఏమయినా వున్నాయేమిటి? వుంటే చెప్పు! తవ్వుదాం!" అన్నాను నవ్వుతూ.

"అబ్బ! అలా తీసి పారెయ్యకండీ! ఇపుడు మనం ఈ ఇంటికి ఆరువేల అయిదు వందల అద్దె కడుతున్నామా, ఇదీ కాక మరో అయిదు వేలు, అంటే మొత్తం పదకొండువేల అయిదు వందలు వాళ్ళకి నెలనెలా మీరు రిటైరయిపోయేదాకా కట్టేస్తే చాలు! అంటే మనం మన స్వంత ఇంటిలోనే వుంటూ, అద్దె ఇంటిలోనే ఇంకా వున్నామని ఊహించుకుంటూ, అదనంగా అయిదువేలు చెల్లిస్తే చాలన్నమాట! అయిదేళ్ళలో ఇల్లు మన స్వంతమయిపోతుంది" అంది ఆనందంగా .

"నెలకి పదకొండు వేల అయిదువందలంటే, అయిదేళ్ళకీ ఆరులక్షల తొంభయి వేలు మాత్రమే చెల్లిస్తాం! అంటే పదహారు లక్షల ఇల్లు సుమారు పన్నెండు లక్షలకే ఇచ్చేస్తారా?" అనుమానంగా అడిగాడు.

"ఇవ్వరండీ! ఈ ఆరులక్షల తొంభయి వేలూ అంతవరకూ వడ్డీ అన్నమాట! అయిదేళ్ళ తర్వాత మీరు రిటైరైపోయాక మీ ప్రావిడెంటు ఫండూ, గ్రాట్యూటీ, లీవు శాలరీ ఇలాంటివన్నీ ఒకేసారి మీ చేతికి వస్తాయి కదా, వాటిల్లోంచి వాళ్ళ అసలులో మిగిలిన పదకొండు లక్షలూ కట్టేయాలి! అప్పుడు ఇల్లు మన పేర రిజిష్ట్రీచేస్తారు" అంది.

"అంటే పదహారు లక్షల ఫ్లాట్‌కీ మనం మొత్తం మీద ఇరవై మూడు లక్షలదాకా చెల్లిస్తున్నాం అన్నమాట! అదీకాక ఫ్లాట్‌కి మెయింట్‌నెన్స్ ఛార్జీలు నెలనెలా మరో ఏడొందలో ఎనిమిది వందలో కట్టుకోవాలి... దారుణం" అన్నాను.

"మీరు మరీ విడ్డూరంగా మాట్లాడతారు! కేవలం అయిదు లక్షలు కట్టేసి మనం మన స్వంత ఇంట్లో వుండటంలేదా? ఈ అయిదేళ్ళు మనఅద్దె తగ్గినట్లు కాదా? ఇలా అయితే మనం ఎప్పటికీ స్వంత ఫ్లాటు కొనుక్కోలేం!" అంటూ మళ్ళీ ముక్కుఎగబీలుస్తూ రాగాలు తీయబోయింది. ఇహ లాభంలేదు! మా ఆవిడ ఈ 'వెంచర్'కి సిద్ధపడిపోయినట్లు కనిపించింది.

"సరే నువ్వలా అప్‌సెట్ అయిపోకు! పూర్తిగా ఈ బ్రోచరులో ఏముందో చదవనియ్! నువ్వు లోపలికెళ్ళి నాఅల్మారా పై అరలో భూతద్దం వుంది, పట్రా!" అన్నాను.

"భూతద్దం ఎందుకు? బాగానే కనిపిస్తోంది కదా!" అంది.

"ఇందులో స్పష్టంగా కనిపించని దొంగదెబ్బలెన్నో ఉంటాయి. అవి భూతద్దంలో వెదికితే సరిగ్గా కనిపిస్తాయి. బ్రోచర్‌లో ఎక్కడో ఒక వారగా చిన్న నక్షత్రం మార్కుపెట్టి చీమతలకాయలంతటి అక్షరాలతో ఏవో నిబంధనలు ముద్రిస్తారు! వాటిని జాగ్రత్తగా పరిశీలించి మనం అడుగు ముందుకువేయాలి. లేకపోతే ఇరుక్కుపోతాం. వెళ్ళి భూతద్దం పట్రా" అన్నాను. మా ఆవిడ సన్నగా గొణుక్కుంటూ లోనికి వెళ్ళింది.

బ్రోచరు తిరగేశాను. అందులో సుందరి చెప్పిన వివరాలే వున్నాయి! కింద పేరాలో 'రిటైరయ్యాక పాపం ఎలా బతుకుతారు?' అంటూ మరో శీర్షిక వుంది దానికి సమాధానంగా ఎలా సుఖంగా బతకొచ్చో వివరించారు! ఇల్లు రిజిష్టరు అయి పోయాక ఆ డాక్యుమెంట్లు బ్యాంకులో 'రివర్స్‌మార్టుగేజ్‌'లో పెడితే తరువాత పదిహేను సంవత్సరాలు వరకూ వాళ్ళు నెలనెలా ఆరువేలు ఇస్తారట! ఆ డబ్బుతోబాటు అదనపు సేవింగ్స్ సహాయంతో మనం హాయిగా బతికెయ్యవచ్చునట! ప్రకటనలో కుడి ప్రక్కమూలగా ఆ కంపెనీ డైరెక్టరు గారి ఫోటో కూడా ముద్రించారు. గెడ్డం గీసుకున్న ఒసామా బిన్‌లాడెన్‌లా వున్నాడాయన!

అంతా చదివాక నాకో అనుమానం వచ్చింది.

నా అరవయ్యో ఏటనుండీ డెబ్బయి అయిదో ఏట వరకూ, ఒకటి రెండు నెలలు మినహాయించి నా ఫ్లాటు తనఖాలోనే వుంటుంది ఈ లెఖ్ఖన! కానీ చిన్నపుడు మా నాన్నగారు రాయించిన జాతక చక్రం ప్రకారం కొక్కిరాపల్లి కొల్లూరు పెదరామం సిద్ధాంతిగారు నా డెబ్బయ్యో ఏటనే నాకు మారకం వుందన్నారు. పిడపర్తి వారయితే పిన్న వయసులోనే పోతానని చెప్పేరట! నేమాని సిద్ధాంతిగారు నీటి గండం వుందన్నారు! తంగిరాల సిద్ధాంతిగారు అరవై అయిదు తర్వాత జాగ్రత్తగా వుండాలని ఈ మధ్యనే చెప్పారు. అయ్యన్న పంతులుగారయితే "మీ ఆరోగ్యస్థితి గ్రహప్రకారం ఏమీ బాగాలేదు, జాగ్రత్తగా వుండండి" అంటూ పదేళ్ళక్రితమే చెప్పారు. అంతేకాదు రోడ్డుమీద నమస్కారం పెట్టినప్పుడల్లా "బాగున్నారా?" అంటూ "ఇంకా పోలేదా?" అని ధ్వనించేలా పలకరిస్తూ వుంటారు. ఏసిద్ధాంతీ కూడా నేను డెబ్బయి అయిదేళ్ళవరకూ బ్రతికి వుంటానని చెప్పలేదు! అంటే తనఖా ఇంటిలోనే నేను తనువు చాలించాలి కాబోలు! 'అద్దె ఇంటిలో పోతే మంచిదా? తనఖా ఇంటిలో పోతే మంచిదా?' అని తీవ్ర ఆలోచనలో వుండగా మా ఆవిడ భూతద్దం పట్టుకొచ్చింది.

మా ఆవిడ చేతిలోని భూతద్దం అందుకుని 'సెర్చింజిన్' లాగ బ్రోచరు అంతా వెదకటం ఆరంభించాను. చీమ తలకాయలాంటి అక్షరాలు నక్షత్రం గుర్తు పక్కన కనిపించాయి. దొంగ దెబ్బ దొరికింది! "సదుపాయాలు, పన్నులు, రిజిస్ట్రేషను అదనం" అంటూ గట్టిగా మా ఆవిడకి చదివి వినిపించాను.

"అంటే ఐదు లక్షలుకాక అదనంగా మనం ఇంకా ఖర్చుచేయాలా?" ఆత్రుతతో అడిగింది.

"అంతేకదా మరి! సదుపాయాలు అంటే కిటికీలుంటాయి, గ్రిల్స్ మనమే పెట్టించుకోవాలి.! అల్మారా అంటే గోడకో పెద్ద కన్నం వుంటుంది! అందులో స్లేబులు వేయించుకుని తలుపులు పెట్టించుకోవాలి. డ్రాయింగ్ రూంలో కన్నానికి షోకేసు తయారు చేయించుకోవాలి! బాల్కనీలకు గ్రిల్స్ ఉండవు. అవి మనం చేయించుకోవాలి. అదనపు ప్లగ్గు పాయింట్లు మనమే వేయించుకోవాలి. ఇలాంటి సదుపాయాలన్నీటికీ మరో లక్షన్నర వసూలు చేస్తారు! సర్వీసు టాక్సు ఓ యాభయివేల వరకూ వుంటుంది. అంటే అదనంగా మరో రెండులక్షలు పట్టుకోవాలి. అంటే మొత్తం వాళ్ళకి ఇపుడు ఏడు లక్షలు కడితే కానీ ఆ ఇంట్లో పాలు పొంగించటం కాదు కదా, కనీసం కాఫీ ఫిల్టరులో పోసుకోటానికి నీళ్ళు కూడా పొంగించలేం!అయిదేళ్ళ తర్వాత రిజిస్ట్రేషనుకు మరో లక్ష ఖర్చవుతుంది. కనీసం !" అన్నాను.

"బాగుంది! అయితే ఏడు లక్షలు పట్టుకోవాలన్న మాట!" అంది సుందరి.

"అన్నమాట కాదు ఉన్నమాటే! ఇప్పుడు మనకి ఏడు లక్షలు ఎలా వస్తాయి?" అడిగాను.

"ముందు అయిదు లక్షలు సమకూర్చుకోటానికి కూడా సులువులు ఇందులో రాసారని చెప్పాడు, ఆ మార్కెటింగ్ కుర్రాడు!" అంది మా ఆవిడ పట్టువదలని విక్రమార్కునిలా!

"అదే వెతుకుతున్నాను... ఆ! ఇదిగో మళ్ళీ చీమ తలకాయలు ఇక్కడ వున్నాయి.

'ప్రస్తుతం అయిదు లక్షలూ చెల్లించటానికి మీ సేవింగ్స్, ప్రావిడెంటు ఫండు నాన్ రిటర్నబుల్ లోను, ఇంకా మీ శ్రీమతి సహకారం పొందండి' అంటూ రాశారు" అన్నాను., చేతిలోని సెర్చింజన్ పక్కన బెడుతూ!

"పిల్ల పెళ్ళిచేసి పంపించాక పట్టుమని పాతికవేలు సేవింగ్స్ ఎకౌంట్‌లో ఉండడం లేదుకదా!" అంది సుందరి నిరాశగా.

" పి.ఎఫ్. నాన్ రిట్నర్నబుల్ లోన్ అమ్మాయి పెళ్ళికి లక్షన్నర లాగేశాం! ఇప్పుడు మళ్లీ తీస్తే మహా అయితే నాలుగు లక్షల వరకూ రావొచ్చును! ఇంకా మూడు

లక్షల రూపాయలు కావాలి! మీ శ్రీమతి సహకారం పొందండి, అని రాశారు మరి!"

"నా దగ్గర పోపుల డబ్బాలో నలభై రెండు రూపాయలున్నాయి! అవి కావాలంటే మీకు ఇచ్చేస్తాను, నాన్ రిటర్నబుల్ లోన్ గానే లెండి!" అంది సుందరి నవ్వుతూ.

"అలా అనకు! నీ సహకారం వుంటే మూడు లక్షలూ, మూడురోజుల్లో సంపాదించగలం"

"ఎలా?" అడిగింది సుందరి ఎంతో కుతూహలంతో.

"నీకు పసుపు కుంకుమల కింద మీ నాన్న మూడెకరాలు ఇస్తానన్నారు. ఇంతవరకూ ఇవ్వలేదు! ఆమూడెకరాలూ అమ్మేసి వెంటనే డబ్బు తెమ్మని నిన్ను వేధిస్తాను! ఆ డబ్బు తీసుకురాకపోతే పెట్రోలు పోసి నిన్నుతగలబెట్టేస్తాను! అంటూ నీమీద అరుస్తాను..." నామాటలు పూర్తి అవకుండానే సుందరి పూనకం వచ్చిన దానిలా నామీద విరుచుకుపడిపోయింది.

"అయ్యో! అయ్యో! మీకేం పోయేకాలం వచ్చిందండీ! ఏమిటా అప్రాచ్యపు మాటలు? నన్ను పెట్రోలు పోసి తగలెట్టేస్తారా? ముప్పయేళ్ళకాపురం చేశాక అనవలసిన మాటలేనా ఇవి?..." అంటూ ఏడుపు లంకించుకుంది.

"అది కాదు, నీ సహకారం ఎలా తీసుకోవాలా? అని అన్ని మార్గాలు వెతుకుతున్నాను..."

"ఇందులో నా సహకారం ఏమిటి? మీరు నామీద పెట్రోలు పోస్తే నేనే అగ్గిపుల్ల గీసుకోవాలా?" ఏడుస్తూ అడిగింది.

"అలా అల్లరి చేస్తే నీకు పసుపు కుంకుమల కింద మీ నాన్న ఇస్తానన్న మూడెకరాలు ఇప్పుడే ఇచ్చేస్తారని!" నీళ్ళునముల్తూ అన్నాను.

" ఆ భూమి కౌలు మీద వచ్చే గింజలతోనే మావాళ్ళు బతుకుతున్నారు. వాళ్ళ తదనంతరం నాకిస్తామన్నారు! మీరేమో పసుపు కుంకుమలకు కాదు నాకే ఎసరు పెడుతున్నారు"

"ఇదంతా నా ఆలోచన కాదు. బ్రోచర్‌లో రాసిన సలహా మేరకు ఆలోచిస్తున్నాను!" సుందరి చీర చెంగుతో కళ్ళుఒత్తుకుంది! అంతలో చటుక్కున నాకో ఆలోచన స్ఫురించింది!

"సహస్ర సూర్యకాంతుల ప్రకాశించు, ఆ ఆభరణంబు నీ మాంగల్యంబు కాబోలు... దానినేవెలకైన తెగనమ్మి నీ పతి గృహంబు కొనుగోలుకు సహకరించరాదటే పతివ్రతా..." అంటూ హరిశ్చంద్ర నాటకంలో, కాటిసీనులో ఆయన పాడిన బాణీలో పద్యం లాంటిది పాడి వినిపించాను.

"మీకేమయిన పిచ్చెక్కిందా? పుస్తెలతాడు అమ్మేసి మీకు డబ్బు సమకూర్చాలా?" అంటూ మళ్ళీ డాన్సు కట్టింది సుందరి.

"మాంగల్యంబు అంటే కేవలం పుస్తెలతాడు ఒక్కటే కాదు! దానికి ఆనుకుని నీమెడలో వున్న రెండు పేటల చంద్రహారాలు, మూడుపేటల పలకసర్లు, చేతికి వున్న రెండు జతల గాజులు వెరసి తొమ్మిది తులాలు! అంటే ఇటూ అటూగా లక్షాఎనభై వేలు! శ్రీమతి సహకారం అంటే ఇదే అని నాకిపుడు అర్థమైంది!" మాటలు ఆపి ఓ నిమిషం పాటు ఆమె రియాక్షన్ కోసం ఎదురు చూశాను.

"మా పుట్టింటి వారు చేయించిన నగలు ఇవన్నీ" కాస్త ఎత్తిపొడుపు ధోరణిలో అంది.

'నువ్వు మన పెళ్ళయిన తర్వాత నాకు తులం బంగారం కొనలేదురా చవటాయ్' అని ధ్వనించింది ఆమె మాటల్లో. కానీ అవన్నీ నేను పట్టించుకోదలచుకోలేదు.

"ఆ నగలను నేను ఇవ్వనుగాక ఇవ్వను" అని ఆవిడ నోటితోనే అనిపించేస్తే, ఈ ప్లాటు కొనేబాధ నాకు తప్పుతుంది. అదే నా కోరిక కూడా.

"సుందరీ! నీ పుట్టింటివాళ్ళు పెట్టిన నగలు అమ్మేటంతటి నీచుణ్ణి కాదు నేను! అన్నీ అమ్మేసినా కూడా ఇంకా ఏవో అప్పులు చేస్తేకానీ డబ్బు చాలదు! ప్రస్తుతానికి ప్లాట్ సంగతి మరిచిపోదాం!" అన్నాను కాస్త నిస్పృహ నటిస్తూ.

మా ఆవిడ మూడు నిముషాలు మౌనంగా వుండిపోయింది.! తర్వాత దీర్ఘంగా నిట్టూరుస్తూ "సరే! నా నగలన్నీ పుస్తెలతో సహా రేపే తీసి ఇచ్చేస్తాను. మీరు మీకు వచ్చే లోన్‌లన్నిటికి అప్లికేషన్లు పెట్టండి! ఫ్లాట్ కొనేద్దాం"! అని గంభీరంగా చెప్పి, కుర్చీలోంచి లేచి లోపలకు వెళ్ళిపోయింది.

నేను అడ్డంగా దొరికిపోయాను! 'చచ్చితి! కడుదాపునకు వచ్చితి! సురిగిపోనయితి కాదు!' అనుకుంటూ కుర్చీలో వెనక్కి చేరగిలబడి పోయాను.

రాత్రి తొమ్మిది గంటలకు భోజనం చేసి మంచం ఎక్కేసి నిద్రకుపక్రమిస్తూ భగవంతుడా! 'రేపటి నుంచీ ఫ్లాటు కొనే ప్రయత్నంలో వుండాలి! రిటైర్‌మెంట్ ముందు ఏమిటీ కష్టాలు?' అనుకుంటూ పది గంటలకు నిద్రలోకి జారిపోయాను.

★ ★ ★

ఉదయం... పేపరు తిరగేస్తూ వుంటే మెడలో పసుసుకొమ్ము, పసుపు తాడుతో దర్శనమిచ్చింది, మా ఆవిడ! నేను విస్తుపోయాను!

నేను ఏదో అనేలోగానే నా చేతిలో నగల మూట పెట్టింది. "తొందరగా లేచి తెమలండి! బంగారయ్యగారి షాపు కెళ్ళి నగలు అమ్మెయ్యండి!" అంది గంభీరంగా.

"అదికాదు సుందరీ..." అని మాట్లాడబోతూ వుంటే "సెంటిమెంట్లు పెట్టుకోకండి! స్వంత ఫ్లాటు ముఖ్యం మనకి!" అంది ఓదార్పుగా.

ఇక నేను చేయగల్గింది ఏమీ లేదని అర్థమయిపోయింది. నాకు! బంగారయ్య గారితో గీసిగీసి బేరాలాడి లక్షానలభై వేలు రాబట్టగలిగాను ఆ నగలమీద! 'అమ్మబోతే అడవి,కొనబోతే కొరివి!' అని బంగారం గురించి మన పెద్దలు అనేది ఇందుకే కాబోలు!!

ఆ తర్వాత ఇరవైరోజులలో నా 'ఫిఎఫ్. నాన్ రిటర్నబుల్ లోన్,' ఫెస్టివల్ ఎడ్వాన్సు ఇంకా పాతబాకీల వసూళ్ళు, ఒకటిరెండు చేబదుళ్ళు, ఇలాంటివన్నీ చేసి కాస్త అటూఇటూగా ఏడు లక్షల రూపాయలు కూడదియ్యగలిగాను.! నా సామర్థ్యానికి నాకే ఆశ్చర్యం కల్గింది!. ప్రతి మొగవాడి విజయం వెనకాలా, అతడి భార్య సాధింపులు, సతాయింపులూ, బుర్ర తినెయ్యడాలూ వుంటాయని, నాకు పూర్తి నమ్మకం కల్గింది!

ఓ శుభముహూర్తాన,'రియల్టర్ అండ్ రియల్టర్' సంస్థవారి చేతుల్లో మొత్తం డబ్బులు పోసి, ఆతర్వాత మరో శుభముహూర్తాన మా కొత్తఫ్లాట్‌లో ఆనందోత్సాహాలతో పాలు పొంగించుకుని ఇంట్లో దిగిపోయాం. మొత్తానికి నేనో ఇంటివాణ్ణి అయ్యాను!

నెలనెలా పన్నెండు వేల పై చిలుకు ఇంటికి ధార పోసేస్తూ వుంటే, నా జవసత్వాలు ఉడిగిపోతున్నాయి కానీ మా ఆవిడ జవసత్వాలు పెరిగిపోతున్నాయి!

అయిదు సంవత్సరాల తర్వాత, నేను రిటైరయిపోయాను! ముందుగానే అన్నిరకాల అప్పులు చేసెయ్యటం వలన, రిటైర్మెంటు బెనిఫిట్లు అన్నీ కలిసి పన్నెండున్నర లక్షలు మాత్రమే వచ్చాయి. ప్రయివేటు కంపెనీ అవటం వల్ల పెన్షను సదుపాయం ఎటూ లేదు.! ఆలస్యం చేయకుండా రియల్టర్ సంస్థవారికి పదకొండు లక్షలు కట్టేసి మరో లక్ష రిజిస్ట్రేషన్‌కి ఖర్చుపెట్టి ఫ్లాట్ నా పేర రిజిస్టర్ చేయించుకున్నాను. భవిష్యత్తులో బతకటానికి కేవలం యాభయివేలు మాత్రమే మిగిలాయి చేతిలో!

క్లుప్తంగా బతకగలిగితే ఈ డబ్బుతో మరోమూడు నాలుగు నెలలు గడచిపోవచ్చు. తర్వాత ఎలా? భయం పట్టుకుంది నాకు! అందుకని రియల్టరు వారు ఇచ్చిన ఉచిత సలహా మేరకు 'స్టేట్ బేంకు' వారి దగ్గర ఫ్లాటు 'రివర్స్ మార్ట్‌గేజ్' చేయదల్చుకున్నాను.బేంకుకు వెళ్ళి వివరాలు అడిగితే వారు ఎంతో ఆదరంతో నన్ను అక్కున చేర్చుకుని, వెంటనే సర్వేయరును పంపి నా ఇల్లు విలువ కట్టించి, ఆవిలువ పదిలక్షలుగా తేల్చి, అందులో తొంభయి శాతం నా అర్హత విలువ తొమ్మిది లక్షలుగా, నిర్ధారించారు. పదిహేను సంవత్సరాల బాటు నా ఇల్లు వాళ్ళదగ్గర తనఖా వుంచుకొని ఆపదిహేనేళ్ళూ ఒక నెలకీ లక్షకి రెండు వందల పాతిక రూపాయలు చొప్పున నాకు ప్రతినెలా ఇస్తామన్నారు.

"అదేమిటండీ!నెలకు ఆరువేలకు పైగా వస్తుందని ఈ బ్రోచరులో రాసారు

కదా!" అంటూ నేను దాచివుంచిన రంగుల బ్రోచరు బేంకు మేనేజరుకు చూపించాను.

"ప్రయివేటు సంస్థలు ముద్రించిన బ్రోచర్ల మీద నేను కామెంట్ చెయ్యలేను! మార్గాల్సు ప్రకారం మేం వెళ్ళిపోతాం! పదిహేను సంవత్సరాల తర్వాత మొత్తం మీకిచ్చిన అసలు, దానిమీద పదిన్నర శాతం వడ్డీ కలిపి ఆ మొత్తం మీరు చెల్లించేస్తే; మళ్ళీ మీ డాక్యుమెంట్లు మీ పేరున 'రీ ప్రాసెస్' చేస్తాం. ఈ స్కీములో వున్నంత వరకూ మీ ఫ్లాట్‌లో మీరే వుండాలి! ఇంకెవరికీ అద్దెకివ్వటం లాంటివి చెయ్యకూడదు" అంటూ నిబంధనలన్నీ బోధపరిచాడు ఆయన.

'రోటిలో తలదూర్చి రోకటిపోటునకు వెఱువదీరునా?' అని చిన్నయసూరిగారు ఏనాడో చెప్పారు కదా అనుకున్నాను.

వారం తిరక్కుండానే ఫ్లాట్‌ని 'రివర్స్ మార్ట్‌గేజ్' చేసి బేంకునుండి నెలనెలా రెండువేల పాతిక రూపాయలు అందుకోవటం ఆరంభించాను. నెల గడవటాని అదే ఆధారంగా మిగిలింది. నేను నిత్యమూ భయంభయంగా బ్రతుకుతూ ఉంటే "నారు పోసిన వాడు నీరు పొయ్యడా! అధైర్యపడకండి!" అంటూ మా ఆవిడ నాకు ధైర్యం నూరి పోస్తోంది. దినదిన గండంగా, బ్రతుకు భారంగా మరో అయిదు సంవత్సరాలు గడిచి పోయాయి. గత అయిదారు నెలలుగా, నా దినచర్య మారిపోయిన దుస్థితి దాపురించింది. రోజూలాగే పొద్దుటే స్నానం చేసి బాగా పెంచుకున్న గెడ్డాన్ని దువ్వెనతో సరి చేసుకుని, నుదుట విభూతి పెట్టుకుని, కాషాయ వస్త్రాలు కట్టుకుని, చేతిలో ఒక త్రిశూలం, కమండలం, దండం పట్టుకుని అడుక్కు రావటానికి కోవెల దగ్గరకు బయలుదేరాను!

"ఈవేళ్టి నుండి కార్తీక మాసం ఆరంభమయింది కదా! సీతమ్మ ధారలో రామలింగేశ్వర స్వామి కోవెల దగ్గర కూర్చోండి! జనం చాలామంది వస్తారు! వైష్ణవాలయం దగ్గర కూర్చుంటే ఈ నెల కిట్టుబాటు కాదు! కనాకష్టంగా అయిదు రూపాయలు వేస్తే తీసుకోకండి. పదిరూపాయలు అయినా అడగండి. ముష్టెత్తటం పూర్తయ్యాక, ఇంటికి వచ్చేటప్పుడు ఇరవై రూపాయలకు ఓ వంకాయ, ఐదురూపాయలకు రెండు పచ్చిమిరపకాయలు ఇరవై రూపాయలకి రెండు చెమ్చాల నూనె పేకెట్టు, అయిదు రూపాయలిచ్చి ఓ అల్లం తొక్క కొని తీసుకురండి! నిన్ననే వందరూపాలు పెట్టి అరకిలో బియ్యం కొన్నాను. ఈ వేళ వంకాయ కూర నాలిక్కి రాసుకుని ఇంత అన్నం తిందాం! మళ్ళీ రేపటి నుండీ మామూలు గంజే కదా!" అంటూ హితబోధ చేసి పంపించింది. మాఆవిడ!

రామలింగేశ్వర ఆలయం ముందు రోడ్డువారగా మట్టిలో త్రిశూలం గుచ్చి, తువ్వాలు పరుచుకుని కూర్చుని, "హరహర మహాదేవ శంభో...బాబూ! ధర్మం చెయ్యండి

బాబూ!" అంటూ అడుక్కోవటం ప్రారంభించాను. దయగల మారాజులు అయిదూ పదీ తువ్వాలు మీద పడేస్తున్నారు. (అయిదు రూపాలలోపు నాణేలనూ, నోట్లనూ రిజర్వు బేంకు వారు ఏనాడో కేన్సిలు చేశారు)

అంతట్లో ఒక పెద్దాయన గుడిలోకి వెళ్తూ, ఓ పదిరూపాయలబిళ్ళ నా తువ్వాలు మీదకు విసరబోతూ హఠాత్తుగా ఆగిపోయి, నావంకే నిశితంగా చూడడం ఆరంభించాడు. "మిమ్మల్ని...నిన్ను...నిన్ను ఎక్కడో చూసినట్లుందే!" అన్నాడు, ఆయన నన్ను అలా ప్రశ్నించకముందే ఆయన్ని నేను గుర్తుపట్టాను. గెడ్డం లేని ఒసామా బిన్ లాడెన్‌గారు!

"అవును బాబయ్యా.. మీ ఊహ కరక్టే! పదేళ్ల క్రిందట మీయందాడ వెంచర్‌లో నేను ఫ్లాటు కొన్నాను. మీకు మొత్తం డబ్బు కట్టేశాక, బతకటానికి మార్గం లేక, మీరు మీ బ్రోచర్‌లో రాసినట్టే నా ఫ్లాటు బేంకు వారి దగ్గర 'రివర్స్ మార్ట్‌గేజ్' చేశాను. ప్రస్తుతం ఆ ఫ్లాటులోనే కాపురం వుంటూ ఇలా అడుక్కు తింటున్నాను. బాబయ్యా..." అన్నాను.

"మీ ఫ్లాటు అద్దెకు ఇవ్వకపోయారా! ఆఏరియాలో రెంట్లు బాగా పెరిగిపోయాయి కదా! పాతికవేలు రెంటు వస్తుంది కదా!" అన్నాడాయన.

"రివర్సు మార్ట్‌గేజ్ వుంటే ఫ్లాటు అద్దెకివ్వకూడదట బాబయ్యా! ఫ్లాటు సొంతదారుడే అందులో వుంటూ, అడుక్కుని తినాలట! అది వాళ్ళరూలు!" అన్నాను.

"ఓహో! అదా సంగతి! అదో రూలు వుందన్న మాట! మీతోబాటు ఫ్లాటు తీసుకున్న రామానుజం గారు శంకరమఠం దగ్గరా, వెంకటప్పయ్యగారు స్టేషను దగ్గరా ఇలాగే అడుక్కుంటూ కన్పించారు ఆ మధ్య. బాధపడకండి! ప్రతి కుక్కకీ దాని రోజంటూ ఒకటి వుంటుంది. 'ఎవ్విరి డాగ్ విల్ హేవ్ ఇట్స్ ఓన్ డే" అంటూ నన్ను ఓదార్చి ఓయాభయి రూపాయలు ముష్టి వేసి 'హరహర మహాదేవ శంభో' అనుకుంటూ గుళ్ళోకి వెళ్ళిపోయాడు! నేను మళ్ళీగొంతెత్తి " ధర్మం చెయ్యండి బాబయ్యా" అంటూ అరవటం ప్రారంభించాను.

* * *

ఎవరో గట్టిగా కుదిపినట్లు అయితే నిద్రనుండి మెళకువ వచ్చింది!

ఎదురుగా మా ఆవిడ సుందరి! "ధర్మం చెయ్యండి బాబయ్యా అంటూ అరుస్తున్నారు! ఏదైనా పీడకల వచ్చిందా?" అంటూ ఆందోళనగా నావంక చూస్తూ అడిగింది.

ఆమె మెడలో పుస్తెలు, నగలు, చేతిగాజులు అన్నీ భద్రంగానే వున్నాయి.

'హమ్మయ్య' అని మనసులోనే అనుకుని "అవును! పీడకలే!" అంటూ మంచం దిగాను.

కాలకృత్యాలు తీర్చుకుని, కాఫీత్రాగి, పేపరు పట్టుకుని డ్రాయింగు రూంలో కూర్చున్నాను! మా ఆవిడ స్నానానికి వెళ్ళింది.

అంతలోనే ఓ యువకుడు వచ్చాడు. "సార్, రియల్టర్ అండ్ రియల్టర్ కంపెనీ నుండి వస్తున్నాను! నిన్న వచ్చి మేడంని కలిసి వివరాలు చెప్పాను! మేడం ఇప్పుడు రమ్మన్నారు! మీరు పదినిముషాలు 'స్పేర్' చేస్తే వివరాలు మీకూ చెబుతాను" అంటూ వినయంగా నమస్కరించాడు.

నేను పేపరు ముడిచి పక్కనబెట్టి " అలా కూర్చోండి! మేం ఫ్లాట్ బుక్ చేయటంలేదు! సారీ! కానీ మీరో పని చేసి పెట్టాలి! ఈ వేళ మధ్యాహ్నం మీరు మేడమ్ కి ఫోను చేసి " మీ ఆయనకి నెల జీతం కనీసం నలభైవేలు వుంటేగానీ మా కంపెనీ వాళ్ళు ఫ్లాట్ ఇవ్వమంటున్నారు అని చెప్పండి! ఇదిగో మా ఇంటి ఫోను నెంబరు" అంటూ చిన్న స్లిప్పు మీద మా ఫోను నెంబరు రాసి ఇచ్చాను అతనికి.

"సారీ సార్! మేం అలా చెప్పకూడదు! అలా చెబితే నా ఉద్యోగం పోతుంది." అన్నాడు.

"సరే మీరు రౌడీ కాసింఖాన్ పేరు విన్నారా?" అంటూ అడిగాను.

" ఎందుకు వినలేదు సార్! అల్లిపురం ఏరియాలో చాలా ఫేమస్! వాడి పేరు వింటే పిల్లలు కూడా పాలు తాగరట! ఇప్పటికే అయిదుగుర్ని పట్టపగలే లేపేశాడట"

"కరెక్ట్!వాడు నా చిన్నప్పటి క్లాస్‌మేటు! నేనంటే వాడు ప్రాణం పెడతాడు! నేనేం చెప్పినా వాడు వెంటనే చేసేస్తాడు!నేను చెప్పిన విధంగా మీరు మధ్యాహ్నం ఫోను చేసి మా ఆవిడకి చెప్పపోతే, వాడు లేపేసిన ఆరో కేసు, రేపటికి మీరే అవుతారు! ప్రాణాల మీద ఆశ వుంటే నేను చెప్పినట్లు చెయ్యండి" అన్నాను, కఠినంగా. అతడు భయంగా లేచి నిలబడిపోయాడు!

"మీరు చెప్పినట్లే తప్పకుండా పన్నెండు గంటలకి ఫోన్ చేసి మేడమ్‌కి మీరు చెప్పమన్నట్లే చెబుతాను! మీరు ఫ్లాటు కొనొద్దులెండి!" అంటూ వడివడిగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు! నేను తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాను.

తనఖా కొంపలో తనువు చాలించే దౌర్భాగ్యం నాకు తప్పిపోయినందులకు ఆనందిస్తూ, పేపరు చదవటంలో మునిగిపోయాను! ★

(నవ్యవీక్లీ హాస్య కథలపోటీలో ద్వితీయ బహుమతి, సెప్టెంబర్ 2011)